పైసలు ముట్టనిదే పనులు చేయరు!

అవినీతికి నిలయం సికింద్రాబాద్‌ జీహెచ్‌ఎంసీ నార్త్‌జోన్‌ కార్యాలయం

- మూడు విభాగాల్లోనూ అదే పరిస్థితి
- ఏసీబీకి చిక్కుతున్నా మారని తీరు


సికింద్రాబాద్‌ జీహెచ్‌ఎంసీ కార్యాలయం

సికింద్రాబాద్‌: సికింద్రాబాద్‌ నార్త్‌జోన్‌ కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ నిర్వహించిన సోదాల్లో అసిస్టెంట్‌ సిటీ ప్లానర్‌(ఏసీపీ) విఠల్‌రావు పట్టుబడిన విషయం తెలిసిందే. రెండు భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీచేసేందుకుగాను నిర్మాణ దారుడి నుంచి రూ.8 లక్షలు డిమాండ్‌ చేసిన టౌన్‌ప్లానింగ్‌ అధికారి విఠల్‌రావు ఏసీబీ వలకు చిక్కారు. నార్త్‌జోన్‌ కార్యాలయం, అందులోని సికింద్రాబాద్‌, బేగంపేట్‌ జీహెచ్‌ఎంసీ సర్కిల్‌ కార్యాలయాలు అవినీతికి కేరాఫ్‌ అడ్రస్‌గా మారుతున్నాయి. జీహెచ్‌ఎంసీలోని మూడు విభాగాలు అవినీతికి నిలయంగా ఉంటుండగా ఇందులో మొదటి స్థానం మాత్రం టౌన్‌ప్లానింగ్‌ అధికారులది కావడం గమనార్హం. టౌన్‌ప్లానింగ్‌, హెల్త్‌ అండ్‌ శానిటరీ, ట్యాక్స్‌ విభాగాల సేవలు మొత్తంగా అవినీతి మయమవుతున్నాయన్న విమర్శలు దినదినం ఎక్కువ అవుతున్నాయి.

- ఈ మూడు విభాగాల్లోని అధికారుల అవినీతి బాగోతాలు ఈ ప్రాంత ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. బాధితులు ఏసీబీని ఆశ్రయించిన సందర్భాల్లో మాత్రమే కొందరు అధికారులు పట్టుబడుతుండగా... ఎక్కువ సంఖ్యలోని అధికారులు సొమ్ముచేసుకుంటున్నారు. నార్త్‌జోన్‌ పరిధిలోని మూడు ప్రధాన విభాగాల్లో తరచూ అధికారులు ఏసీబీ వలకు చిక్కుతున్నా నీతివంతమైన సేవలకు మాత్రం ఇక్కడ బీజం పడడం లేదన్నది వాస్తవం.

టౌన్‌ప్లానింగ్‌ విభాగంలో...

నార్త్‌జోన్‌ కార్యాలయంతోపాటు రెండు సర్కిళ్ల టౌన్‌ ప్లానింగ్‌ విభాగం పనితీరు రెండేళ్లుగా మరీ అధ్వాన్నంగా తయారైంది. ముఖ్యంగా సికింద్రాబాద్‌, బేగంపేట డివిజన్లలో టౌన్‌ప్లానింగ్‌ సెక్షన్‌ అధికారుల దారుణమైన పనితీరుతో పదకొండు డివిజన్లకు చెందిన ప్రజలు గృహనిర్మాణం చేపట్టాలంటేనే బెంబేలెత్తి పోతున్నారు. అధికారులకు డబ్బులు ముట్టజెప్పడం కోసం గృహనిర్మాణ దారులను మున్షీలు వేధిస్తున్న తీరు విస్మయపరుస్తుంది.

- టౌన్‌ప్లానింగ్‌ అధికారులే అక్రమ నిర్మాణాలను మున్షీలద్వారా గుర్తించడం, బినామీ పేర్లతో ఫిర్యాదులు చేయించడం, సెటిల్మెంట్‌ చేసి అందినంత దండుకుంటున్న చర్యలు ఇక్కడి గృహనిర్మాణ దారులకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. రెండు సర్కిళ్ల పరిధిలో డబ్బు చెల్లించనిదే ఎటువంటి నిర్మాణం చేపట్టుకోవడానికి వీలులేని పరిస్థితులు నెలకొంటున్నాయి.

పారిశుద్ధ్య విభాగంలో...

లెక్కాపత్రం లేని అవినీతికి కేరాఫ్‌ అడ్రస్‌గా హెల్త్‌ డిపార్టుమెంట్‌ ఉంది. రహదారుల శుభ్రం చేయడం, పరికరాల కొనుగోలు మొదలు అడుగడుగునా ఈ విభాగంలో అవినీతి రాజ్యమేలుతుంది. ఇందులో పర్యవేక్షుడిగా పనిచేసిన కృపాదానం అనే వ్యక్తి, అసిస్టెంట్‌ మెడికల్‌ ఆఫీసర్‌ వెంకటరమణలను వేర్వేరు కేసుల్లో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పారిశుద్ధ్య సిబ్బందిలో హాజరు కంటే ఎక్కువ మనుషులను చూపించడం, సూపర్‌వైజర్లను ఇబ్బందులపాలు చేసి అందినంత దండుకోవడం, హోటళ్లు, వ్యాపార సంస్థల నుంచి అందినంత దండుకోవడం ఈ విభాగం అధికారులు, పర్యవేక్షకులకు దినచర్యగా మారింది.

పన్నుల విభాగంలో...

ఈ విభాగంలో పనిచేసే అధికారులు, సిబ్బంది పనితీరు విపరీత ధోరణిని తలపిస్తుంది. వీరు ప్రభుత్వ సెలవులను కూడా వాడుకోని పరిస్థితి నెలకొంది. ఆదాయం కోసం సెలవు దినాల్లోనూ వీరు విధుల్లో ఉంటుండడం గమనార్హం. పన్నుల మదింపులు, మ్యుటేషన్‌, ఎల్‌ఆర్‌ఎస్‌ రుసుము తప్పించుకోవడం కోసం కావాల్సిన పనులన్నీ చేసిపెట్టడంలో వీరు సిద్ధహస్తులు. ఈ క్రమంలోనే ఈ విభాగం అధికారిని ఏసీబీ అధికారులు పట్టుకున్నా పరిస్థితిలో మార్పు లేదు. జీహెచ్‌ఎంసీఉన్నతాధికారులు స్పందించి పై మూడు విభాగాల్లో అవినీతి వ్యవహారాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

నాలుగేళ్లలో ఏసీబీకి పట్టుబడిన అధికారులు

- మహేశ్‌, టౌన్‌ప్లానింగ్‌ సెక్షన్‌ ఆఫీసర్‌.
- కృపాదానం, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌.
- నిత్యానందం, వాల్యుయేషన్‌ ఆఫీసర్‌.
- రాజేశ్‌, టౌన్‌ప్లానింగ్‌ సెక్షన్‌ ఆఫీసర్‌.
- వెంకటరమణ, అసిస్టెంట్‌ మెడికల్‌ ఆఫీసర్‌.
- ట్యాక్సు సూపరింటెండెంట్‌ ఐలయ్య
- నార్త్‌ జోన్‌ టౌన్‌ ప్లానింగ్‌ ఏసీపీ విఠల్‌రావు

నేరుగా ఫిర్యాదు చేయండి

ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు లంచం అడిగిన సందర్భంలో నేరుగా ఏసీబీకి ఫిర్యాదు చేయండి. ప్రజలకు సేవలు అందించడంలో లంచాలు వసూలు చేయడం నేరం. బాధితుల నుంచి ఫిర్యాదులు అందిన సందర్భాల్లో సత్వరమే స్పందిస్తున్నాం. అధికారులు, ఉద్యోగులు లంచం డిమాండ్‌ చేసిన సందర్భాల్లో 1064 కంట్రోల్‌ రూం ద్వారా ఏసీబీ అధికారలకు ఫిరయాదు చేయాలి. లేదా 9440446106 వాట్సాప్‌ నెంబర్‌ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

– శ్రీధర్‌, ఏసీపీ, అవినీతి నిరోధక శాఖ

13 ఏళ్ల తరువాత ఎన్నికలు హర్షణీయం

అడ్డగుట్ట: సౌత్‌ లాలాగూడలోని రైల్వే సీనియర్‌ ఇన్‌స్టిట్యూట్‌ మేనేజింగ్‌ కమిటీ ఎన్నికలు 13 ఏళ్ల తరువాత నిర్వహించడం హర్షణీయమని లాలాగూడ వర్క్‌షాప్‌ రైల్వే కార్మికులు అన్నారు. శనివారం లాలాగూడ వర్క్‌షాప్‌ ఆవరణలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి రెండేళ్లకోసారి జరగాల్సిన ఎన్నికలు కొందరి కారణంగా 13 సంవత్సరాలు జరగలేదన్నారు. ఇప్పటికైనా నిర్వహించడం అభినందనీయమన్నారు.

దోమల నివారణకుస్పెషల్‌ డ్రైవ్‌


సిబ్బందితో బౌద్ధనగర్‌ కార్పోరేటర్‌ కంది శైలజ

సికింద్రాబాద్‌: దోమల నివారణకు జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్‌ సర్కిల్‌ అధికారులు శనివారం స్పెషల్‌ డ్రైవ్‌ను ప్రారంభించారు. తొలుత ప్రయోగాత్మక కార్యక్రమాన్ని బౌద్ధనగర్‌ డివిజన్‌లో ప్రారంభించారు. నాలాపరివాహక ప్రాంతం బౌద్ధనగర్‌ డివిజన్‌లో ఎక్కువగా ఉండడం, నాలాలను ఆనుకుని పలు బస్తీలు ఉన్న నేపథ్యంలో ఈ డివిజన్‌ను పైలట్‌ ప్రాజెక్టు కోసం ఎంపిక చేసినట్టు జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌ డి.సుభాష్‌రావు తెలిపారు. కార్యక్రమంలో బౌద్ధనగర్‌ కార్పోరేటర్‌ కంది శైలజ, ఎంటమాలజీ ఏఈ సునీత, సర్వేక్షకుడు యోనస్‌ తదితరులు పాల్గొన్నారు.

బస్‌ షెల్టర్‌ నిర్మాణ పనులు ప్రారంభం

చిలకలగూడ : చిలకలగూడ గాంధీ చౌక్‌, నామాలగుండు చౌరస్తాల్లో బస్సుషెల్టర్‌ నిర్మాణ పనులు శనివారం ప్రారంభం అయ్యాయి. ఈమేరకు సీతాఫల్‌మండి కార్పొరేటర్‌ సామల హేమ ఆయా ప్రాంతాల్లో నిర్మిస్తున్న బస్సుషెల్టర్‌ నిర్మాణపనులు పరిశీలించారు.

ఉచిత దంత వైద్య శిబిరం



బొల్లారం: వివేకానంద కాలనీలో శనివారం మల్లారెడ్డి డెంటల్‌ కాలేజ్‌ ఫర్‌ ఉమెన్‌ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. కాలనీ వాసులకు డాక్టర్లు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించి, దంతల ఆరోగ్యంపై సలహాలు, సూచనలు ఇచ్చారు. కాలనీ అధ్యక్షుడు వైవీ నర్సింగ్‌రావు, కమిటీ సభ్యులు రామారావు, బాబు సుందర్‌, నాగరాజ్‌ పాల్గొన్నారు.

మురుగు నీటితో ఇబ్బంది



లాలాపేట: తార్నాక డివిజన్‌ లాలాపేటలోని గడి స్కూల్‌ సమీపంలో కొద్ది రోజులుగా మురుగు పొంగుతూ బస్తీ రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికుడు ప్రవీణ్‌ వాపోయాడు. అధికారులు చర్యలు తీసుకొని మురుగు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఫాగింగ్‌ ప్రారంభించిన డిప్యూటీ మేయర్‌



లాలాపేట: ఎంటమాలజీ ఆధ్వర్యంలో దోమల నిర్మూలన కోసం నిర్వహించ తలపెట్టిన మాస్‌ ఫాగింగ్‌ కార్యక్రమాన్ని శనివారం తార్నాకలో డిప్యూటీ మేయర్‌ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి ప్రారంభించారు. కాలనీల్లో స్వయంగా తిరుగుతూ ఫాగింగ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డి, ఎంటమాలజీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ నేతల అన్నదానం



పద్మారావునగర్‌: టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌ కుమార్‌ గౌడ్‌ జన్మదినం సందర్భంగా శనివారం కాంగ్రెస్‌ నాయకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సికింద్రాబాద్‌ గాంధీ ఆసుపత్రి ఎదురుగా పేదలకు అన్నం ప్యాకెట్లు అందజేశారు. కాంగ్రెస్‌ నాయకులు ఎన్‌. అరుణ్‌ గౌడ్‌, మాజీ కార్పొరేటర్‌ ఎంఆర్‌ శ్రీనివాస్‌, ఎస్‌. ప్రకాష్‌ పాల్గొన్నారు.

బస్‌స్టేషన్‌ ఆవరణను శుభ్రం చేసిన పవర్‌గ్రిడ్‌ ఉద్యోగులు



బన్సీలాల్‌పేట్‌: పవర్‌గ్రిడ్‌ ఉద్యోగులు శనివారం స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద ఎత్తున ఉద్యోగులు జూబ్లీ బస్‌స్టేషన్‌ ఆవరణలో శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఆర్టీసీ సిబ్బందితో కలిసి ఉద్యోగులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పవర్‌గ్రిడ్‌ సదరన్‌ రీజియన్‌-1 చీఫ్‌ జనరల్‌ మేనేజర్‌(ఫైనాన్స్‌) వెంకట ఎస్‌వీ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఓయూలో టీపీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌ గౌడ్‌ జన్మదిన వేడుకలను విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. శనివారం ఆర్ట్స్‌ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్‌ కేక్‌కట్‌ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు వలిగొండ నరసింహా, అంసా అధ్యక్షులు నామ సైదులు, బూర శ్రీనివాస్‌గౌడ్‌, శరత్‌నాయక్‌, బైరు నాగరాజుగౌడ్‌, వంగూరి శివ, సందీప్‌, మల్లికార్జున్‌, విజయ్‌, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను పరిష్కరించండి

అమీర్‌పేట: ప్రజాసమస్యలు గుర్తించడంతో పాటు అధికారుల సహకారంతో వెంటనే పరిష్కరించాలని సనత్‌నగర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. అమీర్‌పేట డివిజన్‌ బౌద్ధనగర్‌లో శనివారం పర్యటించారు.రోడ్ల మరమ్మత్తులు, డ్రైనేజీ వ్యవస్థ,వీధి దీపాలు,పారిశుద్ధ్యం,నీటి సరఫరా,ప్రజల భద్రత వంటి అంశాలపై పర్చించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు





అడ్డగుట్ట: రాణి అహల్య బాయి హోల్కర్‌ త్రిశతాబ్ది జయంతి ఉత్సవాల సందర్భంగా బీజేపీ డివిజన్‌ అధ్యక్షురాలు గాజుల సౌందర్య ఆధ్వర్యంలో శనివారం వెంకట్‌నగర్‌లోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి జాయింట్‌ కన్వీనర్లు శారద మల్లేష్‌, అనూష, కళావతి తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌: పార్సిగుట్ట హనుమాన్‌ దేవాలయంలో బీజేపీ నాయకులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అహల్యబాయి హోల్కర్‌ జయంతి సందర్భంగా బౌద్ధనగర్‌ డివిజన్‌ బీజేపీ అధ్యక్షుడు పి.సాయిప్రసాద్‌గౌడ్‌ నేతృత్వంలో పార్టీ నాయకులు పూజలు నిర్వహించారు. హిందూ దేవాలయాల పరిరక్షణ కోసం కృషి చేసిన అహల్యబాయి హోల్కర్‌ జీవిత చరిత్రను తెలియజెప్పాలన్న ఉద్దేశంతో పూజలు, హారతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఆపరేషన్‌ కగార్‌ మారణహోమంపై విచారణ జరిపించండి


మాట్లాడుతున్న ఆజాద్‌

ఉస్మానియా యూనివర్సిటీ: మావోయిస్టుల ఏరివేతనకు చేపట్టిన ఆపరేషన్‌ కగార్‌ మారణహోమంపై విచారణ చేపట్టాని ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్‌ చేశారు. శనివారం ఆర్ట్స్‌ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విద్యార్థి నేతలు మాట్లాడుతూ.. విద్యార్థి ఉద్యమ నేత విజయలక్ష్మిఎహత్య పై అన్ని రాజకీయ పార్టీలు స్పందించాలని కోరారు. సీపీఐ మావోయిస్టు జాతీయ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవ రావును 72వ ఏటా పట్టుకొని చంపి ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరించడం దారుణమన్నారు. కేశవ రావును అరెస్ట్‌ చేయకుండా దారుణంగా చపడం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో ఆజాద్‌, నాగేశ్వర్‌ రావు, శ్రీకాంత్‌, హరీష్‌గౌడ్‌, నాగరాజు, లెనిన్‌, అజయ్‌ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలి


రోడ్డు భద్రతపై అవగాహన కలిగిస్తున్న, నార్త్‌జోన్‌ ట్రాఫిక్‌ ఏసీపీ శంకర్‌రాజు..

సనత్‌నగర్‌: భద్రత ప్రతిఒక్కరి జీవితానికి నేస్తం లాంటిదని, అది లేకుంటే జీవితం అస్తవ్యస్తమని నార్త్‌జోన్‌ ట్రాఫిక్‌ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. రోడ్డు భద్రతపై అమీర్‌పేటలోని క్యాపిటల్‌ అండ్‌ హౌసింగ్‌ ఫైనాన్స్‌ సిబ్బందికి శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు మాట్లాడుతూ అతివేగం అంతిమ ప్రయాణంగా మారే ప్రమాదం ఉందన్నారు. ట్రాఫిక్‌ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. బేగంపేట టీటీఐ ఇన్‌స్పెక్టర్‌ నాగుల అశోక్‌ మాట్లాడుతూ డ్రైవింగ్‌ లైసెన్స్‌ లేకుండా వాహనాలు నడపరాదని, ఇది చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో జోనల్‌ రిస్క్‌ మేనేజర్‌ రవికుమార్‌, జియో సేల్స్‌ మేనేజర్‌ భాస్కర్‌రెడ్డి, రికవరీ మేనేజర్‌ వెంకటరమణ పాల్గొన్నారు.

పార్క్‌ చేసిన బైక్‌ చోరీ

సనత్‌నగర్‌: ఇంటి ముందు పార్క్‌ చేసిన కేటీఎం బైక్‌ చోరీకి గురైన సంఘటన సనత్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది,. పోలీసులు తెలిపిన మేరకు.. భరత్‌నగర్‌కు చెందిన జిమ్‌ ట్రైనర్‌ అట్ల బాల గోపీకృష్ణారెడ్డి (27) తన కేటీఎం బైక్‌ను ఈ నెల 22న రాత్రి ఇంటి ముందు పార్క్‌ చేశాడు. మరుసటి రోజు ఉదయం చూడగా బైక్‌ కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

సనత్‌నగర్‌: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని బేగంపేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 130 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. బేగంపేట రసూల్‌పురా ఇందిరమ్మ నగర్‌ బీరప్ప ఆలయ సమీపంలోని ఓ ఇంట్లో గంజాయి అమ్ముతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఆ ఇంటిపై దాడులు నిర్వహించారు. రసూల్‌పురా ఇందిరమ్మనగర్‌ ఇలాహి మసీదు దగ్గర ఉండే ఆటోడ్రైవర్‌ చెట్కూరి వేణు (21), కూలీ పనిచేసే బోయిన్‌పల్లి హస్మతపేటకు చెందిన గుర్రాల మధుసూదన్‌ (19) గంజాయి విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. వీరు రసూల్‌పురా మీ–సేవా సమీపంలో ఉండే డ్రైవర్‌ కరెట్ల నరేష్‌ (22) వద్ద కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లుగా పోలీసుల విచారణలో తేలింది. అయితే కరెట్ల నరేష్‌ పరారీలో ఉన్నాడు. చెట్కూరి వేణు, గుర్రాల మధుసూదన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న నరేష్‌ కోసం గాలింపు చేపట్టారు. బేగంపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఎంటీఎస్‌ రైలు ఢీకొని వ్యక్తి మృతి

సికింద్రాబాద్‌: పట్టాలు దాటే క్రమంలో రైలు ఢీ కొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు.జీఆర్‌పీ హెడ్‌ కానిస్టేబుల్‌ డేవిడ్‌రాజు తెలిపిన మేరకు.. సంజీవయ్య పార్కు ఎంఎంటీఎస్‌ రైల్వేస్టేషన్‌ సమీపంలో పట్టాలు దాటుతున్న ఓ వ్యక్తి (48)ని ఎంఎంటీఎస్‌ రైలు ఢీ కొట్టడంతో మృతి చెందాడు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు మృతుడు బేగంపేట్‌ డివిజన్‌ పాటిగడ్డ ఎన్‌బీటీనగర్‌కు చెందిన ఎస్‌ సత్యేందర్‌గా గుర్తించారు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

రైలు ఢీకొని కార్మికుడి మృతి

సికింద్రాబాద్‌: రైలు పట్టాల మరమ్మతు చేస్తూ ప్రమాదవశాత్తు రైలు ఢీ కొట్టడంతో శనివారం ఒక ప్రైవేటు రైల్వే కార్మికుడు మృతి చెందాడు. సికింద్రాబాద్‌ జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్‌ పండరి తెలిపిన వివరాల ప్రకారం... శేరిలింగంపల్లికి చెందిన టి.ప్రదీప్‌ (38) రైల్వేలో ప్రైవేటు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా రైలు పట్టాలకు గ్రీస్‌ పెట్టుతుండగా వేగంగా వచ్చిన శబరి ఎక్స్‌ప్రెస్‌ రైలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ప్రదీప్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మారిన విద్యుత్‌ అధికారుల ఫోన్‌ నెంబర్లు

సికింద్రాబాద్‌ ప్యారడైజ్‌ డివిజన్‌ పరిధిలో విద్యుత్‌ అధికారుల ఫోన్‌ నెంబర్లు మారాయి. టీఎస్‌ఎస్‌పీడీసీఎల్‌ సికింద్రాబాద్‌ ప్యారడైజ్‌ డివిజన్‌ పరిధిలో డీఈ, ముగ్గురు ఏడీఈలు, 9 మంది ఏఈలు ఉన్నారు.

–బన్సీలాల్‌పేట్‌

ప్యారడైజ్‌ డివిజన్‌ డీఈ బ్రహ్మనందం	: 87124 70324
జేమ్స్‌స్ట్రీట్‌ ఏడీఈ: శివదుర్గాప్రసాద్‌	: 87124 70343
బైబిల్‌ హౌస్‌ సెక్షన్‌ ఏఈ: క్రిష్ణ	: 87124 70373
ప్యారడైజ్‌ సెక్షన్‌ ఏఈ: శివ	: 87124 70374
జనరల్‌ బజార్‌ సెక్షన్‌ ఏఈ: రవికుమార్‌	: 87124 70375
క్లాక్‌టవర్‌ సెక్షన్‌ ఏఈ: విజయలక్ష్మి	: 87124 70376
పద్మారావునగర్‌ ఏడీఈ: మహేష్‌కుమార్‌	: 87124 70342
సీతాఫల్‌మండి సెక్షన్‌ ఏఈ: శ్రీకాంత్‌రెడ్డి	: 87124 70370
పార్సీగుట్ట సెక్షన్‌ ఏఈ: విల్‌మా	: 87124 70372
పద్మారావునగర్‌ ఏఈ: సుబ్రహ్మణ్యం రాజు	: 87124 70368
తార్నాక సెక్షన్‌ ఏఈ: ప్రతిభారెడ్డి	: 87124 70369
లాలాగూడ సెక్షన్‌ ఏఈ: వి. కిష్టయ్య	: 87124 70371
సీబీడీ ప్యారడైజ్‌ ఏడీఈ: ఆదినారాయణ	: 87124 70341

సెక్షన్‌ వారీగా ఫ్యూజ్‌ ఆఫ్‌ కాల్స్‌(ఎఫ్‌ఓసీ)...

పద్మారావునగర్‌	: 87124 70545
పార్సీగుట్ట	: 87124 70544
క్లాక్‌టవర్‌	: 87124 70540/87124 70541
జనరల్‌ బజార్‌	: 87124 70542
బైబిల్‌ హౌస్‌	: 87124 70537/87124 70538
సీతాఫల్‌మండి	: 87124 70546/87124 70547
లాలాగూడ	: 87124 70550
తార్నాక	: 87124 70548/87124 70549
ప్యారడైజ్‌	: 87124 70536/87124 70539

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


చెక్కులను అందజేస్తున్న, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌

సనత్‌నగర్‌: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ అన్నారు. శనివారం వెస్ట్‌ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సికింద్రాబాద్‌ తహశీల్దార్‌ కార్యాలయ పరిధిలోని 44 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌ కింద ఆర్థిక సహాయ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే లబ్ధి పొందిన వారు తమ పరిసరాల్లోని అర్హులైన వారు లబ్ధిపొందేవిధంగా అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు టి.మహేశ్వరి, హేమలత, తహశీల్దార్‌ పాండు నాయక్‌, మాజీ కార్పొరేటర్‌ అత్తిలి మల్లికార్జున్‌గౌడ్‌, బీఆర్‌ఎస్‌ నేతలు శ్రీనివాస్‌గౌడ్‌ పాల్గొన్నారు.

చందన అలంకరణలో శ్రీనివాసుడు



చిలకలగూడ : నామాలగుండు కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారు శనివారం చందన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వైశాఖ మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ ఛైర్మన్‌ నోముల ఇందిరప్రకాశరావు తెలిపారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్‌ నోముల ఇందిరప్రకాశరావు, బీఎస్‌ఆర్‌ గార్డెన్స్‌ అధినేత బిట్ల రఘునందన్‌రావు, సికింద్రాబాద్‌ గణేష్‌ టెంపుల్‌ కమిటీ సభ్యుడు మిట్టపల్లి బాబురావు పాల్గొన్నారు.

శాంతి కోసం ప్రపంచ శాంతి సమావేశం

డాక్టర్‌ కేఏ పాల్‌



సమావేశంలో మాట్లాడుతున్న కేఏ పాల్‌

రసూల్‌పురా : శాంతి కోసం ప్రపంచ శాంతి సమావేశం నిర్వహిస్తున్నట్లు డాక్టర్‌ కేఏ పాల్‌ అన్నారు. సికింద్రబాద్‌ జింఖానా మైదానంలో ప్రపంచ శాంతి సమావేశం శనివారం జరిగింది. భారతదేశం, పాకిస్తాన్‌ మధ్య భవిష్యత్తులో సంఘర్షణను నివారణ, ఉక్రెయిన్‌, రష్యా యుద్ధం, ముగించాలని పిలుపునిచ్చారు. యునైటెడ్‌ స్టేట్స్‌, యూరోపియన్‌ యూనియన్‌, గల్ఫ్‌ , భారతదేశం, పాకిస్తాన్‌ దేశాల నాయకులు శాంతి, సయోధ్య కోసం పనిచేయాలని కోరారు.

అమర వీరులకు నివాళి

లాలాపేట: ఆపరేషన్‌ సిందూర్‌లో అమరులైన వీర జవాన్లకు శనివారం లాలాపేటలోని ప్రొ.జయశంకర్‌ స్టేడియం వద్ద స్థానికులు నివాళులర్పించారు. భారతీయ సైనికుల త్యాగాలను కీర్తిస్తూ పాటలు పాడారు. సహారా స్మాల్‌ స్కేల్‌ ఇండస్ట్రియల్‌ ప్రెసిడెంట్‌ గంధమాల నర్సింగరావు, బాస్కుల కొమురయ్య, వేణు, ప్రసాద్‌, బాలమణి తదితరులున్నారు.

క్రమం తప్పకుండా ఫాగింగ్‌ చేయాలి

సనత్‌నగర్‌: వర్షాకాలం సమీపిస్తున్న దృష్ట్యా దోమలు వృద్ధి చెందకుండా క్రమంతప్పకుండా ఫాగింగ్‌ చేయాలని బేగంపేట కార్పొరేటర్‌ టి.మహేశ్వరిశ్రీహరి ఎంటమాలజీ సిబ్బందికి సూచించారు. ఎంటమాలజీ సిబ్బందితో శనివారం ఆమె సమావేశమై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ మొక్కుబడిగా కాకుండా డివిజన్‌ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో ఫాగింగ్‌ చేయాలన్నారు.

